సాక్షి
వికారాబాద్
శనివారం । 27 । జూలై । 2024



భౌ.. బోయ్..

వీధికుక్కల బెడద తీవ్రమవుతోంది. పట్టణాలు, గ్రామాల్లో ఇది ప్రజలకు పెద్ద సమస్యగా మారింది. 8లో▸



అతిథి గృహానికి నిధులు

మోమిన్‌పేటలోని జెడ్పీ అతిథి గృహానికి అదనపు నిధులు ఇవ్వనున్నట్లు ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్ తెలిపారు. 8లో▸



దినదిన గండం

కొడంగల్ మండలంలోని ఇముడాపూర్ గ్రామ పంచాయతీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. 9లో▸

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం



అనంతగిరి: జిల్లాలోని మోమిన్‌పేట్, మర్పల్లి, నవాబుపేట, వికారాబాద్, ధారూరు, చౌడాపూర్, కోట్‌పల్లి మండలాల్లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఫిజియోథెరపీ చేసేందుకు అర్హులైన బీపీటీ తోపాటు పారా మెడికల్ అసోసియేషన్ రిజిస్ట్రేషన్ కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రేణుకాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 31 లోగా డీఈఓ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

వనమహోత్సవాన్ని విజయవంతం చేద్దాం

ఎమ్మెల్యే కాలె యాదయ్య



కళాశాల ఆవరణలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, విద్యార్థులు

నవాబుపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వనమహోత్సవంలో విద్యార్థులు పాల్గొనేలా చూడాలన్నారు. ప్రజలు భాగస్వాములైతేనే కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో నవాబుపేట ముందు వరుసలో ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనురాధ, ఏపీఓ లక్ష్మీదేవి, ఈసీ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి గీత, కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి, అధ్యాపకులు మంజుల, రమేష్, శ్రీనాథ్, వెంకటయ్య, ఉషారాణి, రవీందర్ నాయక్, కరుణాకర్, డాకేష్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ సమస్యలను త్వరగా పరిష్కరించాలి

రంగారెడ్డి కలెక్టర్ శశాంక



తహసీల్దార్ కార్యాలయ నూతన భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

కడ్తాల్: ధరణి పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా భూ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని తహసీల్దార్ ముంతాజ్‌కు సూచించారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మాణం పూర్తి కావచ్చిన తహసీల్దార్ కార్యాలయ నూతన భవనాన్ని పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని, భవనాన్ని త్వరగా ప్రారంభించి వినియోగంలోకి వచ్చేలా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ వెంట కందుకూరు ఆర్డీవో సూరజ్‌కుమార్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, డీటీ వినోద్ ఉన్నారు.

అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ

రంగారెడ్డి ఏడీఏ గీతారెడ్డి

కందుకూరు: అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ అవుతుందని జిల్లా వ్యవసాయాధికారిణి ఎస్. గీతారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కందుకూరు, గఫూర్‌నగర్, ధన్నారం, పులిమామిడి గ్రామాల్లో శుక్రవారం మండల వ్యవసాయాధికారి లావణ్యతో కలిసి పర్యటించారు. ఆయా గ్రామాల్లో రుణ మాఫీ పొందిన రైతులను నేరుగా కలిసి వారి అభిప్రాయాలు తీసుకున్నారు. రైతులు తమకు సకాలంలో రుణమాఫీ జరిగిందని, ఆ రుణాన్ని పంట సాగుకు ఉపయోగిస్తామని వివరించారు. అనంతరం ఆమె జైత్వారంలో సాగులో ఉన్న మొక్కజొన్న, పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందించారు. రైతు బీమా కోసం ఆగస్టు 5వ తేదీ లోపు ఏఈఓల వద్ద సరైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఏఈఓలకు తెలపాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు ఎల్.రాజు, జె.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

బోనం.. వైభవం



ధారూరు: బోనమెత్తిన యువతులు

జిల్లాలో బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం పలు గ్రామాల్లో అమ్మవార్లకు మహిళలు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఊరేగింపుతో వీధులు సందడిగా కనిపించాయి. వేడుకల్లో మహిళలు, యువతులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదివారం పెద్ద ఎత్తున బోనాల జాతరను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆలయాలకు రంగులు వేసి విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేస్తున్నారు.



బొంరాస్‌పేట: తుంకిమెట్లలో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

ని'బంధనాలు'

- పట్టాదారు పాసుపుస్తకం తోపాటు రేషన్ కార్డు ఉన్నవారికే రుణమాఫీ
- ఇంట్లో ఎంత మంది రైతులు ఉన్నా కార్డుకు రూ.2 లక్షలే..
- ఆ పైన ఉన్న అప్పు, వడ్డీ చెల్లిస్తేనే పథకం అమలు
- మొదటి విడతలో 46,633వేల మందికి లబ్ధి
- మాఫీ అయిన మొత్తం రూ.256 కోట్లు



ధారూరు: ఇటీవల నాగసమందర్ ఎస్‌బీఐలో రుణమాఫీ కోసం వచ్చిన అన్నదాతలు

వికారాబాద్: రుణమాఫీ నిబంధనలు అన్నదాతలకు తలనొప్పిగా మారాయి. పట్టాదారు పాసుపుస్తకం ఉన్న ప్రతి ఒక్కరికీ మాఫీ వర్తింపజేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రేషన్ కార్డు కూడా ఉండాల్సిందే అన్న నిబంధన యాడ్ చేయడంతో అర్హులు పథకం పొందలేకపోతున్నారు.రైతు యూనిట్‌గా కాకుండా రేషన్ కార్డు యూనిట్‌గా తీసుకొని పథకం అమలు చేస్తున్నారు. ఇంట్లో ఎంతమంది రైతులు ఉంటే అంతమందికి రుణమాఫీ అనేది పక్కన పెట్టిన ప్రభుత్వం ..ఇంట్లో ఎంతమంది రైతులు ఉన్నా రేషన్ కార్డుకు రూ.2లక్షలు అనే నిబంధనతో అమలు చేస్తున్నారు.

పలు అంశాల్లో క్లారిటీ లేదు

రుణమాఫీకి సంబంధించి పలు విషయాల్లో ఇంకా క్లారిటీ రావడం లేదు. మాఫీ కోసం ప్రభుత్వం విధించిన కటాఫ్ డేట్ తరువాత రుణాలకు అయిన వడ్డీ చెల్లిస్తేనే మాఫీ వర్తిస్తుందని బ్యాంకర్లు మెలిక పెడుతున్నారు. ఇదే సమయంలో రూ. 2లక్షల పైన రుణాలు తీసుకున్న రైతులు సైతం మిగతా బకాయిలు చెల్లిస్తేనే పథకం వర్తిస్తుందని అంటున్నారు. గత 17న రూ.లక్ష లోపు రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. ఆగస్టు 15లోగా రూ.2 లక్షలు మాఫీ చేస్తామని ప్రకటించింది. రైతులు బ్యాంకులకు వెళ్లి రుణాలను రెన్యువల్ చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. మాఫీ అయిన మొత్తం పోను మిగతా బకాయిలు చెల్లించటం తప్పనిసరా..? బకాయిలు చెల్లించకపోయినా మాఫీ వర్తిస్తుందా..? లేదా..? అనే దానిపై మాత్రం అధికారులు క్లారిటీ ఇవ్వడం లేదు.

ఏటా రూ.18,00 కోట్ల రుణాలు

ప్రతి ఏటా సగటున ఆయా బ్యాంకులు రూ.3,500 కోట్ల వ్యవసాయ రుణాలు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకుంటున్నాయి. అయితే రూ.1,800 కోట్ల నుంచి రూ. 2,000 కోట్లకు మించి ఇవ్వడం లేదు. పీఎం కిసాన్ తరహాలో రైతులకు కాకుండా కుటుంబాలకు అనే నిబంధన తీసుకొచ్చింది. దీంతో చాలా మందికి రుణమాఫీ పథకం అందే అవకాశం లేకుండా పోతోంది. ఒక కుటుంబంలో ఇద్దరు లేక ముగ్గురు రైతులు ఉంటారు. కానీ కార్డు ఆధారంగా ఒకరికి మాత్రమే పథకం అమలవుతుంది. ఒక వేళ ఇద్దరు లేదా ఆపై రైతులు తీసుకున్న మొత్తం రూ.2లక్షల లోపు ఉంటే వారికి వర్తింపజేస్తారు. జిల్లాలో మొదటి విడతలో 46,633 వేల పైచిలుకు మంది రైతులకు రూ. 256,26,30,522 రుణాలు మాఫీ అయ్యాయి.

జిల్లాలో 2.50లక్షల మంది రైతులు

జిల్లాలో 5.90 లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా 2.50లక్షల మంది రైతులు ఉన్నారు. ఏటా సగటున 1.7లక్షల నుంచి 1.8లక్షల మంది రైతులు ఆయా బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలు తీసుకుంటున్నారు. సాగు భూమికి సగటున ఎకరానికి రూ. 30వేల చొప్పున పంట రుణాలిస్తే రూ. 1,700 కోట్లు అవుతుంది. కొన్ని రకాల వాణిజ్య పంటలకు ఎకరానికి రూ.50 వేల నుంచి రూ. లక్ష వరకు కూడా రుణాలు ఇస్తారు. వీటిని దృష్టిలో ఉంచుకొని ఏటా రూ.3,500 కోట్లు రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లు లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. అయితే సగం మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. రైతు కుటుంబాల నిబంధన కారణంగా రూ.2 లక్షల రుణమాఫీలో అర్హుల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం కనిపిస్తోంది.



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఫార్మాకు భూములివ్వం

- తేల్చి చెప్పిన పలు గ్రామాల రైతులు
- ఆర్డీఓకు వినతిపత్రం అందజేత

దుద్యాల్: పర్యావరణానికి, ప్రజల ప్రాణాలకు హాని కలిగించే ఫార్మా కంపెనీలను మండలంలో ఏర్పాటు చేయరాదని హకీంపేట, పోలేపల్లి, లగచెర్ల, పులిచెర్ల తండా, ఆర్‌బీ తండా ప్రజలు కోరారు. శుక్రవారం తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయా గ్రామాల రైతులు మాట్లాడుతూ.. మాకు సమాచారం ఇవ్వకుండా మా భూముల్లో రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్నారని తెలిపారు. తరతరాల నుంచి సాగు చేసుకుంటున్న భూములను కంపెనీల కోసం ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. ప్రభుత్వం పరిహారం ఆశ చూపి మోసం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. వ్యవసాయమే జీవనాధారం.. మేము భూములు ఇవ్వం.. పరిహారం వద్దు అని నినాదాలు చేశారు. ప్రజలకు, పర్యావరణానికి హాని చేసే ఎలాంటి ఫార్మా కంపెనీలు మా ప్రాంతంలో ఏర్పాటు చేయరాదని ప్రభుత్వాన్ని కోరారు. గురువారం తమ పొలాలను సర్వే చేసేందుకు అధికారులు వచ్చారని, వారిని అడ్డుకున్నట్లు రైతులు తెలిపారు. మాకు సమాచారం ఇవ్వకుండా సర్వే ఎలా చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో రైతులు గోవిందు, మొగులప్ప, రాములు, బాబమ్మ, అంజమ్మ, వెంకటమ్మ, శ్యామప్ప, పద్మమ్మ, లక్ష్మి, చెన్నయ్య, అంజిలయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి రుద్రారం సమస్యలు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు, నాయకులు

- పరిష్కరించాలని గ్రామస్తుల వినతి
- రేవంత్‌రెడ్డి ఆదేశాలతో గ్రామంలో పర్యటించిన కడా ప్రత్యేకాధికారి

కొడంగల్: మండలంలో పెద్ద గ్రామ పంచాయతీ అయిన రుద్రారంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ నాయకులు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని తెలిపారు. ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. గ్రామంలో కరెంటు సమస్యలు ఉన్నాయని సీఎంకు విన్నవించారు. జుంటుపల్లికి రోడ్డు సౌకర్యం కల్పించాలన్నారు. స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్.. కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిని గ్రామానికి పంపించి సమస్యలు తెలుసుకోవాలని ఆదేశించారు. దీంతో ఆయన గ్రామంలో పర్యటించారు. సమస్యలకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, నాయకులు వెంకటయ్య గౌడ్, అంబయ్య గౌడ్, గోపాల్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



గ్రామంలో పర్యటిస్తున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి



అమర జవాన్లకు నివాళులర్పిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

అమర జవాన్ల సేవలు వెలకట్టలేనివి

- డీఎస్పీ బాలకృష్ణారెడ్డి
- ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



కొవ్వొత్తులు వెలిగిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు

తాండూరు టౌన్: కార్గిల్ యుద్ధంలో వీరోచిత పోరాటం చేసి అమరులైన జవాన్ల సేవలు వెలకట్టలేనివ ని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ శివారులోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలలో కార్గిల్ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎస్పీ హాజరై అమర వీరులకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..దేశం లోపల ప్రజలు సుఖంగా ఉన్నారంటే సరిహద్దులో జవాన్లు రక్షణగా ఉండటమే కారణం అన్నారు. ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకర స్థితిలో ఉండే సియాచిన్ ప్రాంతంలో.. ఎముకలు కొరికే చలిలో సైనికులు పహారా కాస్తూ దేశాన్ని రక్షిస్తున్నారని కొనియాడారు. భారత్‌పై పాకిస్తాన్ సేనలు దాడి చేసిన సమయంలో మన సైనికులు వీరోచిత పోరాటం చేసి శత్రువులను తరిమికొట్టారని గుర్తు చేశారు. 1999లో కార్గిల్ సరిహద్దులో జరిగిన భీకర పోరాటంలో ప్రాణాలు అర్పించి భారత్‌కు విజయాన్ని తెచ్చిన వీర సైనికులకు గుర్తుగా ప్రతి ఏటా జూలై 26న కార్గిల్ విజయ్ దివస్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నేటి యువత సైనికుల స్ఫూర్తితో దేశ సేవకు నడుం కట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ మాట్లాడుతూ..దేశ పౌరుల శ్రేయస్సు కోసం నిరంతరం ప్రాణాలను అడ్డుగా పెట్టి శత్రువులతో వీరోచితంగా పోరాడే సైనికులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త వెంకట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వేలైన్ మంజూరు చేయండి

ఆమనగల్లు: సూర్యాపేట నుంచి దేవరకొండ, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ మీదుగా గద్వాల్ వరకు నూతన రైల్వేలైన్‌ను మంజూరు చేయాలని కేంద్ర రైల్వేశాఖామంత్రి అశ్వినివైష్ణవ్‌కు జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని కేంద్రమంత్రి కార్యాలయంలో శుక్రవారం ఆయనను నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సుధాకర్‌రావ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డితో వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ ప్రాంతాలకు రైల్వే సదుపాయం కల్పించేందుకు నూతన రైల్వేలైన్ నిర్మించాలని వారు వినతిపత్రం అందించారు.

చిలుకూరులో భారీ బందోబస్తు

మొయినాబాద్: వక్ఫ్‌బోర్డు స్థలంలో పురాతన నిర్మాణం తొలగించడంతో ఏర్పడిన వివాదం సద్దుమణుగుతోంది. మొయినాబాద్ మండలం చిలుకూరు రెవెన్యూలోని వక్ఫ్‌బోర్డు స్థలంలో శుక్రవారం ఓ వర్గం వారు ప్రార్థనలు చేసేందుకు రావచ్చని భావించిన పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎవరినీ అక్కడికి రానీయకుండా సుమారు 180 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతాచర్యలు చేపట్టారు. ఎస్‌ఓటీ, సివిల్ పోలీసులతోపాటు పారామిలటరీ బలగాలను మోహరించారు. మధ్యాహ్నం 12 నుంచి 2.30 గంటల వరకు అటువైపు ఎవరినీ వెళ్లనీయలేదు. ఎవరూ రాకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.



చిలుకూరు బాలాజీ దేవాలయం కమాన్ వద్ద పోలీసుల చెక్‌పోస్టు

మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వద్దు

రంగారెడ్డి అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్నం: మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం చేయొద్దని,ప్రతి పంచాయతీ పరిధిలో ఆరు వేల మొక్కలు తప్పకుండా నాటాల్సిందేనని అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ స్పష్టం చేశారు.వన మహోత్సవంలో భాగంగా చర్లపటేల్‌గూడ పంచాయతీ పరిధిలోని ఖాళీ స్థలంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..జిల్లా వ్యాప్తంగా 82,59,900 మొక్కలకుగాను ఇప్పటి వరకు 28,69,384 నాటినట్లు తెలిపారు. వర్షాలు విస్తారంగా కురుస్తున్నందున పది రోజుల్లో నిర్ణీత లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రతి ఒక్కరూఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఇంటి పేరట్లో, గ్రామ కంఠం ఖాళీ స్థలాల్లో, రోడ్ల కిరువైపులా, పొలాల గట్లపై విరివిగా మొక్కలు నాటాలన్నారు. నీరు, విద్యుత్ సౌకర్యం ఉన్న చోట్ల పండ్ల తోటల పెంపకం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, ఏపీడీ సక్రియనాయక్, ఎంపీడీవో వెంకటమ్మ, ఏపీఓ తిరుపతాచారి, ఈసీ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, టీఏలు శ్రీనిఇవాస్,ఇందిర, సునంద పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



బాధిత కుటుంబ సభ్యుడికి అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

బంట్వారం: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఓ మహిళ కుటుంబ సభ్యులకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శుక్రవారం సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేశారు. మండల పరిధిలోని బొప్పునారం గ్రామానికి చెందిన వెంకటమ్మ అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. బాధిత కుటుంబ సభ్యులు స్పీకర్‌ను కలవడంతో రూ.2,50,000 విలువైన ఎల్‌ఓసీ అందజేశారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్‌పూర్ మాజీ సర్పంచ్ నర్సింలు, నాయకులు దర్శనం నర్సింలు, భీమ్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



అంజిలప్ప(ఫైల్)

దౌల్తాబాద్: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని బిచ్చాల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తెలుగు అంజిలప్ప(55) విద్యుత్ రిపేర్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఓ ఇంట్లో విద్యుత్ సరఫరా కావడం లేదని మరమ్మతులు చేస్తుండగా షాక్‌కు గురయ్యాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కొడంగల్ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. భార్య అంజిలమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవిగౌడ్ తెలిపారు.

జర్నలిస్టుపై దాడి

యువకుడిపై కేసు

మొయినాబాద్: జర్నలిస్టుపై దాడి చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటన మండల పరిధిలోని ముర్తూజగూడలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన ప్రకారం మండల పరిధిలోని ముర్తూజగూడకు చెందిన గణేశ్ ఓ దినపత్రికలో జిల్లా స్టాఫ్ రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఇంట్లో నిద్రిస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన మోసిన్ అనే యువకుడు ఇంటికి వచ్చి గేటు తన్నాడు. రిపోర్టర్ నిద్రలేచి బయటకు రాగానే బూతులు తిడుతూ రోడ్డువైపు తీసుకెళ్లాడు. రోడ్డుపై రెండు కార్లలో కొంతమంది జనం ఉన్నట్లు గణేష్ గమనించి వెనుదిరిగాడు. దీంతో మోసిన్ కారులోంచి ఓ మారణాయుధం తీసుకువచ్చి దాడి చేసేందుకు యత్నించగా అప్పటికే నిద్రలేచిన చుట్టుపక్కలవారు వారించారు. ఇది గమనించి కార్లలో ఉన్న వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. గణేష్ వెంటనే 100 డయల్ చేయడంతో పోలీసులు వచ్చి ఓ కారును, దాడికి పాల్పడిన యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

మొబైల్ దుకాణంలో చోరీ

30 సెల్‌ఫోన్లు.. నగదు అపహరణ

శంకర్‌పల్లి: గుర్తు తెలియని దొంగలు అర్ధరాత్రి బీభత్సం సృష్టించారు. ఓ సెల్‌ఫోన్ దుకాణంలో దూరి 30 మొబైల్ ఫోన్లు, నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన జీవన్ కుమావత్(23) శంకర్‌పల్లి మండలం మోకిలలో మూడేళ్లుగా బాలాజీ మొబైల్ షాప్ నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరగానే గురువారం రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లాడు. గుర్తు తెలియని దుండగులు షటర్‌ను ధ్వంసం చేసి దుకాణంలోకి చొరబడి ఫోన్లు, కౌంటర్‌లోని నగదు ఎత్తుకెళ్లారు. శుక్రవారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భౌ..బోయ్..



హస్నాబాద్ పాఠశాల ఆవరణలో కుక్కల సంచారం



కుక్కకు ముందస్తు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యులు

భయపెడుతున్న వీధి కుక్కలు

- గుంపులుగా సంచరిస్తున్న శునకాలు
- వాహనచోదకులు, పాదచారులకు దడపుట్టిస్తున్న గ్రామ సింహాలు
- అశ్రద్ధ వహిస్తే ప్రాణాలకే ప్రమాదమంటున్న వైద్యులు

దుద్యాల్: వీధికుక్కల బెడద తీవ్రమవుతోంది. పట్టణాలు, గ్రామాల్లో ఇది ప్రజలకు పెద్ద సమస్యగా మారింది. ఎక్కడ చూసినా శునకాలు గుంపులుగా సంచరిస్తూ ఆందోళన కలిగిస్తున్నారు. పగలు, రాత్రి, చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా పాదచారులు, బైక్‌లపై వెళ్తున్నవారిపై, మూగజీవాలపై పడి చేస్తున్నాయి. ద్విచక్ర వాహనదారుల వెంటపడడంతో వారు బైక్‌పై నుంచి పడి గాయపడిన ఎన్నో ఘటనలున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వీధి కుక్కల సమస్య మరింత ఎక్కువగా ఉంది. వీటిని నియంత్రించడంలో అధికారులు విఫలమవుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఏడాదిలో 165 కుక్కకాటు కేసులు

దుద్యాల్ మండల కేంద్రం ప్రధాన కూడలితో పాటు హస్నాబాద్, కుదురుమల్ల, హకీంపేట, పోలేపల్లి, లగచెర్ల తదితర గ్రామాలలోని ప్రధాన వీధులలో కుక్కలు గుంపులుగా ఉంటున్నాయి. నిత్యం చిన్న పిల్లలు పాఠశాలలకు వెళ్తుంటారు. వారిపై దాడి చేసే ప్రమాదం ఉండడంతో చిన్నారులను బయటకు పంపలంటే తల్లిదండ్రులు జంకుతున్నారు. అధికారులు స్పందించి కుక్కలను నియంత్రించాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు. ఉమ్మడి బొంరాస్‌పేట(దుద్యాల్ మరియు బొంరాస్‌పేట) మండలంలో ఈ సంవత్సరం 165 కుక్కకాటుకు కేసులు నమోదు అయినట్లు డాక్టర్ హేమంత్ తెలిపారు. నమోదైన కేసులలో ప్రాణాంతకమైన కేసులు ఏమీ లేవన్నారు.

రేబిస్ సోకితే లక్షణాలు

- ఇంట్లో పెంచుకున్న కుక్కకు రేబిస్ వ్యాధి సోకితే కుటుంబీకుల మాట వినదు.
- ఆహారం సరిగా తీసుకోదు.
- తరచూ నోటి నుంచి సొంగ కారుస్తుంది.
- రెండు కాళ్ల మధ్యలో తోక ముడుచుకుంటుంది.
- ఇలా 14 రోజుల పాటు వ్యాధి లక్షణాలను పరిశీలించి వ్యాధి నిర్ధారణ చేసిన తర్వాత పశువైద్యులను సంప్రదించి చికిత్స చేయించాలి.

కుక్కకాటుకు గురైతే తీసుకోవాల్సిన చర్యలు

- కుక్క కరిచిన వెంటనే వాటర్‌తో, బట్టలు ఉతికే సబ్బుతో కడగాలి. దీంతో 90 శాతం వైరస్ సోకుండా ఉంటుంది.
- గాయానికి కట్టు కట్టొద్దు. దీంతో వైరస్ మరింత వ్యాపించే ప్రమాదం ఉంటుంది.
- వెంటనే డాక్టర్‌ను సంప్రదించి రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి. కుక్క కరిచిన చోటు, కరిచిన విధానాన్ని పరిగణలోకి తీసుకుని రేబిస్ సోకిన కుక్క అయితే 5 నుంచి ఏడు ఇంజెక్షన్‌లు వేయించుకోవాలి.
- కుక్క కాటుకు సంబంధించిన మందులు ప్రతీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంటాయి.

యాంటీ రేబిస్ తప్పనిసరి



ఇంట్లో పెంచుకునే కుక్కల వల్ల కుటుంబంలో ప్రమాదాలు పొంచి ఉంటాయి. కుక్కలు పెంచుకున్న వారు తప్పక వాటికి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించాలి. కుక్కలను పిల్లలకు దూరంగా ఉంచాలి.

– డాక్టర్ రియాజ్ హమ్మద్, ఇన్‌చార్జి పశువైద్యుడు, దుద్యాల్

వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయి



కుక్క కాటు చికిత్సకు కావల్సిన అన్ని రకాల డోసులు అందుబాటులో ఉన్నాయి. కుక్క కాటుకు ఐదు రకాల డోసులతో చికిత్స అందించాల్సి ఉంటుంది. 0,3,7,14,28 రోజులలో వివిధ రకాల డోసుతో వ్యాక్సిన్ ఇవ్వాల్సి ఉంటుంది. కుక్క కాటుకు గురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలి. లేదంటే ప్రాణానికే ప్రమాదం.

– డాక్టర్ హేమంత్, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు, బొంరాస్‌పేట

'రుణమాఫీ' అనుమానాలు నివృత్తి చేయండి



మాట్లాడుతున్న ఏడీ రుద్రమూర్తి

- రైతుబీమాపై అవగాహన కల్పించండి
- వ్యవసాయ శాఖ ఏడీ రుద్రమూర్తి

తాండూరు రూరల్: రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలని తాండూరు డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీ రుద్రమూర్తి అన్నారు. శుక్రవారం అంతారం రైతువేదికలో ఏఓ, ఏఈఓలతో నియోజకవర్గ స్థాయి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ.. అధికారులు రైతు వేదికల వద్ద అందుబాటులో ఉండి వారికి రుణమాఫీకి సంబంధించిన అనుమానాలను నివృత్తి చేయాలని సూచించారు. రైతుబీమాపై విస్తృత ప్రచారం నిర్వహించాలని చెప్పారు. రైతుబీమాలో సవరణ లుంటే ఈ నెల 30వరకు సరిచేసుకునే వెసులుబాటు ఉందని రైతులకు విషయాన్ని వివరించాలన్నారు. కొత్తగా పాస్‌పుస్తకం తీసుకున్న రైతులు ఆగస్టు 5వరకు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ ఏఓలు రజిత, నసీరుద్దీన్, యాదగిరి, సూర్యప్రకాష్, పలువురు ఏఈఓలు ఉన్నారు.

అతిథి గృహానికి అదనపు నిధులు

ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్



మోమిన్‌పేటలోని అతిథి గృహాన్ని పరిశీలిస్తున్న సుధీర్

మోమిన్‌పేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ అతిథి గృహానికి అదనపు నిధులు ఇవ్వనున్నట్లు ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని గెస్ట్ హౌస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ.. అతిథిగృహానికి ప్రహరీ, ఫర్నీచర్ తదితరాలకు అవసరమైన నిధులు ఎస్టిమేట్ చేసి ఇవ్వాలన్నారు. పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి ట్యాంకులను ప్రతీ 15 రోజులకు ఒకసారి తప్పక శుభ్రం చేయాలన్నారు. అనంతరం చీమల్‌దరి గ్రామంలో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం, సీసీ రోడ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈఈ ప్రణీత్ కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ యాదగిరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్ తదితరులున్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

నవాబుపేట: అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించాలని ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. మండల పరిధిలోని దాతాపూర్, పులుమామిడి గ్రామాల్లో రూ.10లక్షల నిధులతో నిర్మించిన అంతర్గత మురుగుకాల్వలు, సైడ్ డ్రైన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదన్నారు. అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ అనురాధ, పంచాయతీ రాజ్ ఏఈ ప్రణీత్ తదితరులున్నారు.

స్టీల్ ఫ్యాక్టరీలో భూ సర్వే

- రైతు ఫిర్యాదు మేరకు సర్వేకు వచ్చిన అధికారులు
- అడ్డుకున్న ఫ్యాక్టరీ యాజమాన్యం
- పోలీసుల సాయంతో సర్వే పూర్తి

పరిగి: సుగుణ ఫ్యాక్టరీ యాజమాన్యం తన భూమిని ఆక్రమించారని ఓ రైతు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సర్వేకు వచ్చిన అధికారులను ఫ్యాక్టరీ యాజమాన్యం అనుమతించలేదు. చివరకు మధ్యాహ్నం పోలీసుల సహకారంతో సర్వే పూర్తి చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని నారాయణపూర్‌లో సర్వే నంబర్ 157లో 2.17 ఎకరాల భూమిని ఫ్యాక్టరీ యాజమాన్యం ఆక్రమించిందని గ్రామానికి చెందిన దోరమోని అంజయ్య సర్వేకు అర్జీ పెట్టుకున్నాడు. దీంతో రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చి శుక్రవారం సర్వే చేసేందుకు వచ్చారు. ఫ్యాక్టరీ యాజమాన్యం అధికారులను లోపలికి అనుమతి ఇవ్వక పోవడంతో మధ్యాహ్నం వరకు రైతు అధికారులు అక్కడే వేచియున్నారు. రెవెన్యూ అధికారులు పోలీసులకు, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడి ఫ్యాక్టరీలోకి అనుమతి ఇచ్చి సర్వే చేయించారు. రెండేళ్లుగా సర్వేకు అర్జీ పెట్టుకున్నా తనపైనే తప్పుడు కేసులు నమోదు చేయించారని ఆరోపించాడు. తనకు న్యాయం చేయాలని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై సర్వే అధికారులను వివరణ కోరగా త్వరలోనే ఆర్డీఓకు నివేదిక అందజేస్తామని సమాధానమిచ్చారు.

జేఈ టీకాతో మెదడువాపు వ్యాధికి చెక్



ఎన్కేపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం సరఫరా చేస్తున్న మెదడు వాపు నివారణ టీకాలను సక్రమంగా వేయాలని జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్ అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని ఎన్కేపల్లి, జీవన్‌గూడ, ముర్తుజాగూడ, బాకారం గ్రామాల్లో జేఈ టీకా పంపిణీ కార్యక్రమాన్ని డాక్టర్ అన్నపూర్ణ ప్రారంభించారు. ఎన్కేపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో టీకా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన డాక్టర్ దామోదర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు మెదడువాపు వ్యాధి సోకకుండా ముందస్తుగా టీకా వేయిస్తున్నామన్నారు. జేఈ వ్యాక్సిన్‌తో మెదడువాపు వ్యాధికి చెక్ పెట్టొచ్చన్నారు. ఇందులో ఎలాంటి అపోహలకు తావివ్వొద్దన్నారు. భోజన సమయంలో చేతులను శుభ్రంగా కడుక్కోవాలని విద్యార్థులకు సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో రోగాలు దరిచేరవని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌రెడ్డి, ఉపాధ్యాయులు యూ.పోచయ్య, సూపర్‌వైజర్ సునీతాదేవి, ఏఎన్‌ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాఫీ కాదు.. కొత్తది రాదు!

- రైతులకు తప్పని నిరీక్షణ
- బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు



పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం

పెద్దేముల్: రైతు సేవా సహకార సంఘ సభ్యులుగా ఉంటే రైతులకు తక్కువ వడ్డీకే పంట రుణాలు.. కానీ ప్రస్తుతం ఇందుకు భిన్నంగా మారింది. ఎస్‌బీఐ సీడెడ్ సొసైటీల ద్వారా 2017 నుంచి రైతులకు పంట రుణాలు ఇస్తున్నారు. ప్రభుత్వం తాజాగా రుణమాఫీ ప్రకటించింది. అన్ని బ్యాంకుల్లో అన్నదాతలు రుణమాఫీతో కళకళాడుతుంటే.. పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘంతో పాటుగా కొత్తగడి, ఎక్‌మామిడి సభ్యులకు రుణమాఫీ కాకపోవడంతో అయోమయంలో పడ్డారు. ఈ మాఫీ సీడెడ్ బ్యాంకులకు చేరలేదు.

గత ప్రభుత్వ హయాంలో 998 మంది రైతులకు మాఫీ

పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘంలో మొత్తం 2,024 మంది సభ్యులున్నారు. అందులో 1,900 మంది రైతులకు సుమారు రూ.12 కోట్ల వరకు పంట రుణాలు ఇచ్చారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో 1,518 మంది రైతులు పంటరుణం తీసుకోగా ఇందులో రూ.లక్ష చొప్పున 998 మంది రైతులకు రూ.6.23 కోట్లు మాఫీ చేసింది. మిగిలిన 520 మంది రైతులకు రూ.5.20కోట్ల బకాయి ఉంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ ప్రకటించింది. దీంతో వారం రోజుల క్రితం వివిధ బ్యాంకులల్లో పంట రుణాలు తీసుకున్న రైతులకు రూ.లక్ష రుణమాఫీ జాబితా విడుదల చేసింది. శుక్రవారం నాటికి పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘంలో రుణమాఫీ ఊసే లేదు. కనీసం ఒక్క రైతుకు కూడ రుణమాఫీ రాకపోవడంతో అటు బ్యాంకు సిబ్బంది ఇటు రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇంతకు మాకు రుణమాఫీ వర్తిస్తుందా.. లేదా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. బ్యాంకు అధికారుల నిర్లక్ష్యమా, ప్రభుత్వ నిర్లక్ష్యమా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో రుణమాఫీ అందని రైతులు కాంగ్రెస్ ప్రభుత్వమైనా చేస్తుందేమోనని ఆశగా ఎదురు చూస్తున్నారు. పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘంలో రుణమాఫీకి 516 మంది రైతులకు అర్హత ఉంది. రూ.లక్షలోపు 278 మంది రైతులకు సుమారు రూ.1.74కోట్ల రుణమాఫీ కావాల్సి ఉంది. లక్షకు పైగా ఉన్న వారు 238 మంది ఉన్నారు. వారికి సుమారు రూ.3.81 కోట్ల బకాయి ఉందని సంబంధిత బ్యాంకు అధి

త్వరగా రుణమాఫీ చేయాలి



రాష్ట్రంలో ఉన్న బ్యాంకులకు ప్రభుత్వం ఏ విధంగా పంట రుణమాఫీ అందజేస్తుందో, అదే విధంగా పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం సభ్యులకు మాఫీ చేయాలి. రుణమాఫీ రాకపోవడంతో రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రుణమాఫీ అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలి.

–డి.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్, పెద్దేముల్

వేర్వేరు చోరీల్లో ఏడుగురికి రిమాండ్



పహాడీషరీఫ్: పోలీసుల అదుపులో గంజాయి నిందితుడు జైనుద్దీన్

పహాడీషరీఫ్: గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని బాలాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ టి.భూపతి తెలిపిన ప్రకారం.. అస్సాం రాష్ట్రానికి చెందిన జైనుద్దీన్(21) ఏడాది క్రితం బతుకుదెరువు నిమిత్తం వలస వచ్చి షాహిన్‌నగర్‌లోని షాజహాన్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. గంజాయికి బానిసైన జైనుద్దీన్ అస్సాం నుంచి గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తీసుకొచ్చి స్థానికంగా అవసరమైన వారికి విక్రయిస్తూ విలాసవంత జీవితాన్ని గడుపుతున్నాడు. గురువారం అల్‌జాబ్రీ కాలనీలో గంజాయి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ భూపతి నేతృత్వంలో డీఐ ఎ.మధు, ఎస్సైలు షేక్ యూసుఫ్ జానీ, శ్రీనివాసులు, నాగరాజు, శ్రీధర్‌గౌడ్ దాడి చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.50 వేల విలువైన డ్రై గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది

దొంగతనం కేసులో ఇద్దరు..

మంచాల: దొంగతనం కేసులో ఇద్దరు వ్యక్తులను మంచాల పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన మంచాల ఠాణా పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ బాబ్యానాయక్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని ఆగాపల్లి సమీపంలో ఓ క్రషర్ మిషన్ వద్ద గుర్తు తెలియని దుండగులు ఈ నెల 24 సుమారు టన్ను బరువైన ఇనుప సామాను దొంగిలించారు. సూపర్‌వైజర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. హయత్‌నగర్ బంజార కాలనీకి చెందిన ఆలకుంట్ల గోపి, దేవరకొండకు చెందిన పీట్ల రాజు, కోదాడకు చెందిన దండుగుల శ్రీను, ఇరగడిండ్ల వీరబాబు పాల్గొన్నట్లు గుర్తించారు. దొంగిలించిన సొత్తును రికవరీ చేసి గోపి, రాజును రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ల్యాప్‌టాప్ చోరీ నిందితులకు..

మీర్‌పేట: ల్యాప్‌టాప్‌లు దొంగిలిస్తున్న ఇద్దరిని మీర్‌పేట పోలీసులు అరెస్ట్ చేసి రూ.6 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లాకు చెందిన పాట మహేష్‌బాబు (24), తిక్క లింగయ్య (23) నగరంలోని కుత్బుల్లాపూర్‌లో నివాసముంటున్నారు. వ్యసనాలకు బానిసలైన వారు చోరీలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో మీర్‌పేటతో పాటు నగరంలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని హాస్టళ్లలోకి ప్రవేశించి ల్యాప్‌టాప్‌లను దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు మీర్‌పేట పోలీసులు దర్యాప్తు చేపట్టి ఇద్దరు నిందితులను శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 13 ల్యాప్‌టాప్‌లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

బెట్టింగ్ యాప్ అప్పులు తీర్చేందుకు...

కొత్తూరు: బెట్టింగ్ యాప్‌లతో అప్పులపాలైన ఓ యువకుడు చోరీల బాటపట్టాడు. గురువారం మండల పరిధిలోని ఖాజీగూడతండాలో చోరీకి విఫలయత్నం చేశాడు. సీఐ నర్సింహారావు తెలిపిన ప్రకారం.. కేశంపేట మండలం రాళ్లగడ్డతండాకు చెందిన పవన్‌నాయక్(21), వెంకటేశ్ నాయక్ స్నేహితులు. పవన్‌నాయక్ బెట్టింగ్ యాప్‌ల కారణంగా రూ.లక్షల్లో నష్టపోయి వాటిని తీర్చేందుకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక ఈ నెల 25న స్నేహితుడు వెంకటేశ్‌నాయక్‌తో కలిసి చోరీ చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో కొడిచర్ల పంచాయతీ ఖాజీగూడ తండాకు బైక్‌పై వచ్చారు. తండాలో మంజుల నిర్వహిస్తున్న కిరణా దుకాణంలో సిగరెట్లు కొనుగోలు చేసి పరిసరాలను పరిశీలించారు. పథకంలో భాగంగా మరో మారు దుకాణానికి వచ్చి బిస్కెట్ ప్యాకెట్ ఇవ్వమని చెప్పి ఆమె మెడలోని బంగారు పుస్తెల తాడు అపహరించేందుకు యత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో ఇద్దరు బైకుపై పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు పేటీఎం యాప్ నుంచి వివరాలు సేకరించి వారి ఇంటికి వెళ్లి అదుపులోకి తీసుకుని విచారించారు. నేరం ఒప్పుకోవడంతో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.



చెరువును తలపిస్తున్న పంట పొలాలు

'భగీరథ' వృథా!

పరిగి: మండల పరిధిలోని రాఘవపూర్ గ్రామంలోని భగీరథ మెయిన్ ట్యాంక్ ఓవర్‌ఫ్లోతో నీరంతా వృథాగా పారింది. షాద్‌నగర్ నుంచి కొడంగల్‌కు వెళ్లే ప్రధాన పైప్‌లైన్‌పై ఉన్న ట్యాంక్ నుంచి లక్షల లీటర్లు వృథాగా పోవడంతో చుట్టుపక్కల పంట పొలాలు పాడయ్యాయి. పంటల పొలాల పక్కనున్న నివాస గృహాల్లోకి నీరు చేరి ప్రజలు ఇబ్బంది పడ్డారు. గతంలోనూ ఇదే సమస్య తలెత్తిందని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడుగంటల పాటు నీరు వృథాగా పారడంతో పంట పొలాలు చెరువులను తలపించాయి. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వామే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.